సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



వైభవం.. పంచగవ్యాధివాసం

చినవెంకన్న క్షేత్రంలో విఖనస మహర్షి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 8లో



మిచాంగ్ ఎఫెక్ట్

పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంపై మిచాంగ్ తుపాను ప్రభావం పడింది. 8లో



పాపికొండల యాత్రకు విరామం

మిచాంగ్ తుపాను నేపథ్యంలో గోదావరిపై పాపికొండల విహార యాత్రకు బోటు ప్రయాణాలను నిలిపివేశారు. 8లో

ముంచుకొస్తున్న మిచాంగ్



గణపవరం మండలం సరిపల్లిలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న ఉపాధి కూలీలు



నరసాపురం మండలం పీఎం లంకలో చొచ్చుకొస్తున్న సముద్రం



నరసాపురం మండలం వేములదీవి ఈస్ట్ గ్రామంలో వృద్ధులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం

తుపాను కలవరం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎడతెగని వాన
- ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా అప్రమత్తం
- 12 పునరావాస శిబిరాల ఏర్పాటు
- ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం
- అధికారుల సుడిగాలి పర్యటన
- ముందస్తు ఏర్పాట్లతో ధాన్యానికి తప్పిన ముప్పు
- పంట రక్షణకు ముమ్మర చర్యలు

సాక్షి, భీమవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 54.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకొల్లు మండలంలో 135 మి.మీ., అత్యల్పంగా కాళ్ల మండలంలో 28.8 మి.మీ వర్షపాతం నమోదైంది. తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలకు సెలవివ్వడంతో అధిక శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుంచి తుపాను ఉధృతి మరింత ఎక్కువైంది. కుండపోతగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా గాలులు బలంగా వీస్తుండటంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి,

అధికారుల అప్రమత్తం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ పి.ప్రశాంతి జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఇతర అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తూ ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, మెకనైజ్డ్ బోట్లను అందుబాటులో ఉంచారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడ ప్రజలకు తాగునీరు, ఆహారం, మందులను అందుబాటులో ఉంచారు. ఆరుగురు గర్భిణులను ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. లోతట్టు, గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను యుద్ధప్రాతిపదికన తరలించే ఏర్పాట్లు చేశారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న ఆచంట, యలమంచిలి మండలాల అధికారులను అప్రమత్తం చేశారు.



నరసాపురం మండలం పెదమైనవానిలంక పునరావాస కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి, ఆర్డీఓ అచ్యుత అంబరీష్



పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో రోడ్డుపై కూలిన చెట్టు

ధాన్యానికి తప్పిన ముప్పు

కల్లాల్లోని తొలకరి పంటను రక్షించేందుకు అధికార యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ఆర్‌బీకేల ద్వారా 1.02 లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయగా, 48,266 టన్నుల ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో రైతులు విక్రయించుకున్నారు. ఇంకా 30 వేల టన్నుల ధాన్యం కల్లాల్లో రైతుల వద్ద ఉందని అంచనా. రైతులు నష్టపోకుండా ఆఫ్‌లైన్‌లో ధాన్యం సేకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ధాన్యం సేకరణ ముమ్మరం చేశారు. నేరుగా కల్లాల్లోకి వెళ్లి ఒక్కరోజులోనే 23,500 టన్నుల ధాన్యాన్ని సేకరించడం ద్వారా పంట నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రత్యేక బృందాలు

పునరుద్ధరణ చర్యలకు ఎంపీడీఓలు, రవాణాశాఖ, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్ అధికారులతో మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించి పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన కటింగ్ యంత్రాలు, పొక్లయిన్‌లు సిద్ధం చేసుకోవాలని బృందాలను ఆదేశించారు.

పునరావాస కేంద్రాలు

నరసాపురం: తుపాను కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తీర గ్రామాల్లో గాలులు, వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నరసాపురం, ఆచంట, మొగల్తూరు, యలమంచిలి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

రక్షణ చర్యలకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, తీర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను నియమించామని కలెక్టర్ అన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 12 తుపాను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, బాధితులను తరలించేలా ఏర్పాట్లు చేశామన్నారు. నరసాపురం మండలంలో 5, మొగల్తూరు మండలం పేరుపాలెంలో 7 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశామని, పీఎంలంకలో పునరావాస శిబిరానికి 150 మంది మత్స్యకారులను తరలించామన్నారు. అలాగే వైద్య శిబిరాలనూ ఏర్పాటు చేస్తున్నామన్నారు.



నరసాపురం మండలం పెదమైనవానిలంక పునరావాస కేంద్రంలో భోజనాలు పెడుతున్న దృశ్యం

పంట నష్టం జరగకుండా చర్యలు

జిల్లాలో 85,364 హెక్టార్లలో వరి సాగుచేయగా ఇప్పటివరకు 30,652 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయని కలెక్టర్ అన్నారు. మిగిలిన 54,611 హెక్టార్లలో పంట పది రోజుల్లో కోత దశకు చేరుకుంటుందన్నారు. ఇప్పటివరకు 1,15,483 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 9,700 టన్నుల ధాన్యం సురక్షిత ప్రాంతాల్లో భద్రపరిచారని, బయట ఉన్న 8,486 టన్నుల ధాన్యం తరలింపునకు చర్యలు చేపట్టామన్నారు. పొలాల్లో వర్షం నీరు దిగువ ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

54.7 మి.మీ. సగటు వర్షపాతం

భీమవరం(ప్రకాశం చౌక్): తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా ఎడతెగని వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. జిల్లాలో సగటున 54.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకొల్లు మండలంలో 135 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా.. భీమవరంలో 53.8, పాలకోడేరులో 56.8, వీరవాసరంలో 60.02, ఉండిలో 37.4, కాళ్లలో 28.8లో, ఆకివీడులో 33.0, ఆచంటలో 94.0, నరసాపురంలో 67.6, యలమంచిలిలో 74.8 తణుకులో 48.2 తాడేపల్లిగూడెంలో 36.8, గణపవరంలో 29.8, పెంటపాడులో 30.0, అత్తిలిలో 33.8, ఇరగవరంలో 46.8, పెనుమంట్రలో 46.6, పోడూరులో 58.0, పెనుగొండలో 63.6, మొగల్తూరులో 58.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

పాఠశాలలకు సెలవులు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమ, మంగళవారాలు కలెక్టర్ సెలవులు ప్రకటించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారీవర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్ఈ పి.సాల్మన్ రాజు సూచించారు. గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచాలి, తడి చేతులతో స్విచ్ బోర్డులను తాకరాదన్నారు. విద్యుత్ స్తంభాలు కూలిన, తీగలు తెగిన వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. గాలివాన సమయంలో విద్యుత్ లైన్ల కింద నిలబడటం, కూర్చోవడం చేయరాదని, సర్వీసు వైరు తెగితే అధికారులకు తెలయజేయాలన్నారు. వ్యవసాయ మోటార్ స్టార్టర్స్, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ సమస్యలను గుర్తిస్తే హెల్ప్‌లైన్ నంబర్ 1912కు తెలియజేయాలని కోరారు. అలాగే ఏలూరులో 9440902926 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామన్నారు.

తీరంలో 'అల'జడి

నరసాపురం : తుపాను ప్రభావంతో జిల్లాలోని తీర ప్రాంతంలో భారీవర్షాలు, గాలులు వీస్తున్నాయి. కలెక్టర్ ప్రశాంతి తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి తుపాను రక్షణ చర్యలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు నరసాపురం, మొగల్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశారు. అధికారులను అప్రమత్తం ఏశారు.

పీఎం లంకలో ముందుకొచ్చిన సముద్రం

ఆదివారం రాత్రి నుంచి నరసాపురం, మొగల్తూరు మండలాల్లో ఎడతెగని వర్షం కురుస్తోంది. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. నరసాపురం మండలం పెదమైనవానిలంకలో సముద్రం సుమారు రెండు మీటర్ల మేర ముందుకొచ్చింది. ముందు జాగ్రత్తలలో భాగంగా జిల్లాలో బీచ్‌లను ఈనెల 8 వరకు అధికారులు మూసివేశారు. సోమవారం కూడా బీచ్ వద్దకు సందర్శకులు రాకుండా చర్యలు తీసుకున్నారు.

వేటకు వెళ్లకుండా చర్యలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం నరసాపురంలో వాతావరణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వాతావరణ పరిస్థితులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు.మత్స్యకారులు వేటకు వెళ్లకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

సుడిగాలి పర్యటన

కలెక్టర్ ప్రశాంతి నరసాపురం మండలంలోని పెదమైనివానిలంక, బియ్యపుతిప్ప, వేములదీవి గ్రామాల్లో పర్యటించి తుపాను సహాయక ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు అందుతున్న వైద్యసేవలు, భోజన వసతులపై ఆరా తీశారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం



పెదమైనవానిలంక పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: అధిక వర్షాల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, పూర్తిస్థాయిలో ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో తుపాను పరిస్థితులను సోమవారం ఆయన పరిశీలించారు. కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్మకాల్లో ఎలాంటి కష్టాలు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఈ మేరకు సీఎం జగన్ ఆదేశాలిచ్చారన్నారు. రైతుల వద్ద ప్రతి ధాన్యపు గింజనూ గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లు ఇబ్బంది పెడితే ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్లు ఇచ్చామన్నారు. తుపాను నష్టాలను తగ్గించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామరన్నారు. ప్రజలెవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు ఉన్నారు. అలాగే పునరావాస కేంద్రాలను సందర్శించారు.

డ్వామా సహాయక చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ మేట్లు, కూలీలు, సిబ్బంది తుపాను ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టారు. ధాన్యం సంరక్షణ, ముంపు నీటి మళ్లింపు పనులు చేపట్టారు. ముంపునకు గురైన 257 ఎకరాల్లో నీటిని బయటకు మళ్లించే పనులు చేశారు. కళ్లాల్లో ఆరబెట్టిన 10,441 క్వింటాళ్ల ధాన్యంపై టార్పాలిన్ క్లాత్, బరకాలు కప్పించి సంరక్షించారు. అలాగే రోడ్ల మీద ఆరబెట్టిన 8,553 క్వింటాళ్ల ధాన్యాన్ని ట్రాక్టర్లపై గోడౌన్లకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అత్తిలి, ఆకివీడు, భీమవరం, నరసాపురం, మొగల్తూరు, పాలకోడేరు, వీరవాసరం, గణపవరం, పాలకొల్లు, పెంటపాడు, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర, తణుకు, తాడేపల్లిగూడెం తదితర మండలాల్లో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పనుల్లో పాల్గొన్నారు.



ఆచంట మండలంలో పొలంలో ముంపు నీటిని ఉపాధి కూలీలతో బయటికి తరలిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

యుద్ధప్రాతిపదికన ధాన్యం తరలింపు



ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు

ఏలూరు(మెట్రో): మిచాంగ్ తుపానుపై జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. విద్యుత్, రవాణా, పంచాయతీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా విధులు నిర్వహిస్తూ తుపాను పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల సెలవులను ఉన్నతాధికారులు నిలిపివేశారు. జిల్లా పంచాయతీ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా పంచాయతీ సేవలు పొందేందుకు 9849903321 నంబర్‌ను అందుబాటులో ఉంచారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెండు రోజులుగా యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో రెండు రోజుల్లో 15 వేల టన్నుల ధాన్యాన్ని తరలించారు. కల్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు గోనె సంచులు, వాహనాలు అందుబాటులో ఉంచుతున్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

రూ.2 కోట్ల నిధుల విడుదల

భీమవరం (ప్రకాశంచౌక్): తుపాను హెచ్చరికల దృష్ట్యా ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని 12 గ్రామాలను తుపాను ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామన్నారు. అలాగే పాలకొల్లు, పాలకోడేరు, భీమవరం మండలాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకున్నామన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న మహిళలను నరసాపురం ఏరియా హాస్పిటల్‌కు తరలిస్తున్నామన్నారు. తుపాను సహాయక చర్యలకు ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. తుపాను సహాయక చర్యల పర్యవేక్షణకు జిల్లాకు ప్రత్యేక అధికారిగా మత్స్యశాఖ స్పెషల్ కమిషనర్ కె.కన్నబాబు వచ్చారన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు.

విభిన్న ప్రతిభావంతుల వేడుకలు వాయిదా

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల విభిన్న ప్రతిభావంతులకు గురువారం భీమవరంలో నిర్వహించాల్సిన విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాలను వాయిదా వేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడ మణి సోమవారం ప్రకటనలో తెలిపారు. భీమవరం డీఎన్నార్ కాలేజీ ప్రాంగణంలో వేడుకలు జరగాల్సి ఉందని, తుపాను కారణంగా వాయిదా వేశామని పేర్కొన్నారు.

రైతులూ.. అధైర్యపడొద్దు

ఏలూరు (మెట్రో): తుపాను కారణంగా రైతులు తాము పండించిన ధాన్యం గురించి ఎటువంటి అధైర్యం చెందవద్దని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి భరోసా ఇచ్చారు. సోమవారం పెదపాడు మండలం వట్లూరు, పెదపాడు గ్రామాల్లో ఆయన పర్యటించి ధాన్యం కొనుగోళ్లు, కళ్లాల్లో పంట పరిస్థితిని పరిశీలించారు. పెదపాడు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు అందుబాటులో ఉన్న వాహనాల వివరాలను తెలుసుకున్నారు. వట్లూరులో పంట పరిస్థితిని పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తోడుగా నిలబడుతుందన్నారు. రోడ్డుపక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని లోడింగ్ చేయించారు. సుమారు వంద టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించామన్నారు.

'ఉపాధి' కల్పనకు ప్రణాళిక

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి కసరత్తు
- ప్రజలు, రైతులు కోరిన పనులకు ప్రాధాన్యం
- 367 పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణ
- 40 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం

సాక్షి, భీమవరం: రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో ఉపాధి కల్పనకు కసరత్తు మొదలైంది. ప్రజా అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. స్థానిక అవసరాలకు తగ్గట్టుగా ప్రజలు, రైతులు పనులను ఎంపిక చేసుకుని గ్రామసభల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆయా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతుల కోసం ఉన్నతాధికారులకు పంపే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది.

1.65 లక్షల జాబ్ కార్డులు

జిల్లాలోని 20 మండలాల పరిధిలో 1.65 లక్షల మందికి ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలో పనుల్లో పాల్గొనే యాక్టివ్ కార్డుదారులు 1.25 లక్షల మంది వరకు ఉన్నారు. ఏటా లక్ష్యానికి మించి జిల్లాలో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. వేతనదారులకు అధిక పని దినాలు కల్పించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా 14వ స్థానంలో ఉంది. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద స్థానిక అవసరాలను బట్టి దాదాపు 95 రకాల పనులు చేపట్టేందుకు వీలుంది. అధిక శాతం ఇంకుడు గుంతలు తవ్వడం, పంట బోదెలు, చెరువుల్లో పూడికతీత, మొక్కలు నాటడం, కొబ్బరి చెట్లకు రింగ్ ట్రెంచెస్ ఏర్పాటు, కంపోస్టుయార్డు, పొలాల్లోని పుంతరోడ్లు, శ్మశాన వాటికలు, ఉద్యానవనాల అభివృద్ధి, గృహనిర్మాణం వంటి పనులు నిర్వర్తించడం ద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. కూలీ ఒక్కొక్కరికీ రోజువారీ వేతనం రూ.272 చొప్పున 90 రోజులకు రూ.24,480 వరకు చెల్లిస్తున్నారు.

367 పంచాయతీల్లో..

జిల్లాలో 384 పంచాయతీలకు గాను మున్సిపాలిటీల్లో 17 విలీన ప్రతిపాదిత పంచాయతీలు మినహా మిగిలిన 367 పంచాయతీల్లో ఉపాధి కల్పనకు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను 37 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటికే 90.27 శాతంతో 33.4 లక్షల పనిదినాలు కల్పించారు. రూ.98.5 కోట్ల విలువైన 11,874 పనులు పూర్తి చేశారు. ఉపాధి కూలీలకు వేతనంగా రూ.80.55 కోట్లు అందజేయగా మెటీరియల్ కాంపోనెంట్‌గా రూ.17.96 కోట్లు చెల్లించారు.



పాలకొల్లు మండలం వెలివెలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఆమోదం అనంతరం

వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను 40 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనుల వివరాలు, అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంచాయతీ, మండల స్థాయిలో ఆమోదం అనంతరం జిల్లాపరిషత్‌కు పంపనున్నారు. ఉన్నతస్థాయి నుంచి అనుమతులు వచ్చాక వచ్చే ఏప్రిల్ నుంచి ఆయా పనులు ప్రారంభిస్తారు.

ప్రణాళికాబద్ధంగా..



రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే 374 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. రైతులు, స్థానికుల చెప్పిన పనులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులపై పనుల వివరాలు, అంచనాలను సిద్ధం చేసి మంజూరు నిమిత్తం ఉన్నతాధికారులకు పంపుతాం.

– ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డ్వామా పీడీ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమార్

తణుకు: తణుకు మండలం పైడిపర్రులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. దువ్వ గ్రామానికి చెందిన సాధన కుమార్ (23)తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం మోటారు సైకిల్‌పై దువ్వ నుంచి తణుకు వస్తున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్ ఢీకొట్టాడు. ఎదురుగా వెళుతున్న మోటారు సైకిల్ యూ టర్న్ తీసుకుంటు ఉండగా గమనించని కుమార్ డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో పైడిపర్రు నుంచి తేతలి వైజంక్షన్ వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో కుమార్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొవ్వలి యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం

దెందులూరు: కొవ్వలి యూనియన్ బ్యాంకులో చోరీ యత్నం జరిగింది. కొవ్వలి యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎస్.పోలావతి మాట్లాడుతూ ఆదివారం బ్యాంకు ఎదురుగా గేటు తాళాలను పగులకొట్టి, స్ట్రాంగ్ రూంలోకి వచ్చే ప్రయత్నం చేశారన్నారు. బ్యాంకు నుంచి నగదు చోరీ కాలేదన్నారు. పోలీసులకు సమాచారం అందడంతో దెందులూరు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ ప్రారంభించారు.

వైభవంగా.. పంచగవ్యాధివాసం

క్షేత్రంలో నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



మహారుషుల ఉత్సవమూర్తులను యాగశాల వద్దకు తీసుకెళ్తున్న అర్చకులు



యాగశాల వద్ద పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం



యాగశాలలో కొలువైన మహా రుషుల ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీ విఖనస మహర్షి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అగ్ని మథనం, అగ్నిప్రతిష్ఠాపన, పంచగవ్యాధివాసం, హోమాది కార్యక్రమాలను అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు శ్రీ భృగు, మరీచి, అత్రి, కశ్యప శిష్య సహిత విఖనస మహా ముని ఉత్సవ మూర్తులను పల్లకి వాహనంలో ఉంచి, పూజాదికాలు జరిపి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పల్లకి వాహనాన్ని ఆలయ తూర్పు ప్రాంతంలోని యాగశాల వద్దకు అట్టహాసంగా తీసుకెళ్లారు. అక్కడ యాగశాలలోని వేదికపై మహా రుషుల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి, పూజాదికాలను ప్రారంభించారు. ముందుగా విశ్వక్సేణారాధన, పుణ్యాహవాచన, దీక్షాధారణ జరిపారు. 11 కలశాలకు పూజలు నిర్వహించారు. ఆ తరువాత అగ్నిమథనం చేసి, హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపి, హోమాలు ప్రారంభించారు. అనంతరం గోమూత్రం, గోమయం, గోక్షీరం, గోపెరుగు, గోఘృతంను మిళితం చేసి, అందులో శ్రీ భృగు, మరీచి, అత్రి, కశ్యప శిష్య సహిత విఖనస మహా ముని ఉత్సవమూర్తులను ఉంచి పంచగవ్యాధివాసాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు పాల్గొన్నారు.

జగన్ కోసం శబరిమలకు పాదయాత్ర



అయ్యప్ప మాలధారుడు రాంబాబుకు సాయం అందిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ కోనసీమ నుంచి శబరిమలకు పాదయాత్ర చేపట్టిన అమలాపురం వాసి కొప్పాడి రాంబాబు ఆదివారం రాత్రి తణుకు చేరారు. ఈ సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ తన 3 సంవత్సరాల కుమార్తెకు వింత వ్యాధి సోకడంతో సీఎం జగన్‌ను కలవగా రూ.కోటికి పైగా ఖర్చయ్యే వైద్యాన్ని ప్రస్తుతం అందిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు తన కుమార్తె ఆరోగ్యంగానే ఉందని, తన కుమార్తెకు జగనన్న పునర్జన్మ అందించారని చెప్పారు. మనసున్న మారాజు జగనన్న తిరిగి మళ్లీ సీఎంగా వస్తే తనలాంటి అభాగ్యులు, ఆపదలో ఉన్నవారికి పెద్ద దిక్కుగా ఉంటారనే ఉద్దేశ్యంతో అందరికీ మంచి జరగాలని అయ్యప్ప మాల వేసుకుని శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తణుకు వచ్చిన రాంబాబుకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్‌కుమార్ రూ. 10 వేలు ఆర్థికసాయం అందచేశారు.

స్పందన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం: స్పందన ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశించారు. భీమవరం సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో సోమవారం స్పందనలో ఎస్పీ రవిప్రకాష్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 8 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

పాపికొండల విహార యాత్రకు విరామం



బుట్టాయగూడెం: మిచాంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి నదిపై పాపికొండల విహారయాత్రకు అధికారులు తాత్కాలిక విరామం ప్రకటించి బోటు ప్రయాణాలు నిలిపివేశారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో బోటు ప్రయాణాలకు తాత్కాలిక విరామం ఇచ్చినట్లు అధికారులు చెప్పారు. దీంతో గండిపోచమ్మ తల్లి దేవాలయం సమీపంలో ఉన్న బోటు పాయింట్ వద్ద బోట్లన్నీ నిలిచిపోయాయి. తుఫాన్ ప్రభావం తగ్గి వాతావరణం అనుకూలించిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ బోట్లు పర్యాటక ప్రాంతాలకు వెళ్తాయని అధికారులు తెలిపారు. గోదావరి నదిపై పాపికొండల విహార యాత్రకు ఇది అనుకూలమైన కాలం. కార్తీక మాసంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్తుంటారు. అయితే తుఫాన్ కారణంగా బోటు ప్రయాణాలకు తాత్కాలిక విరామం వచ్చింది.

క్షీరారామంలో మిచాంగ్ ఎఫెక్ట్



క్షీరారామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



మహన్యాసపూర్వక అభిషేకాల్లో కూర్చున్న భక్తులు

తగ్గిన భక్తుల రద్దీ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రంలో సోమవారం మిచాంగ్ ఎఫెక్ట్ కనిపించింది. భారీ వర్షం వల్ల ఆలయంలో క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. వేకువజామున కాలువ స్నానాలకు వెళ్లే మహిళల సంఖ్య తగ్గింది. స్వామికి నెలవారీ మహన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకునే భక్తులు మాత్రం వర్షంలో తడుస్తూనే ఆలయానికి చేరుకుని అభిషేకాలు చేయించుకున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ పంచారామ యాత్రికులతో ఆలయం కిటకిటలాడింది. సుమారు 20 వేలకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్థానిక రేపాక వారి సత్రంలో నిత్యాన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. క్షీరారామలింగేశ్వస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత పాలు, ప్రసాదం పంపిణీ చేశారు. ఒక పక్క వర్షం ఆపై ట్రాఫిక్ సమస్యలతో యాత్రికులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు ఆలయం లోపల ఉండడంతో రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రించే వారు లేక భక్తులతో పాటు స్థానికులు అనేక ఇబ్బందులు పడ్డారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కామవరపుకోట: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు భూక్య విజయభారతి సోమవారం తెలిపారు. ఈ నెల 3న ఏలూరులో జరిగిన ఎంపికలో పాఠశాలకు చెందిన నక్క భవ్య నందిని, చెంచలగుణ ప్రవల్లిక, చేబోయిన హరి మణికంఠ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 8 నుంచి 10 వరకు తెనాలిలోని ఏఎస్ఎన్ స్టేడియంలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు

ఏలూరు (టూటౌన్): జిత్తులమారి చంద్రబాబు నాయుడు మాటలు వినవద్దని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కోరారు. ఏలూరులోని మాలమహానాడు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీ, అగ్రవర్ణాల పేదలు ఆర్థికంగా ఎదగాలని, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. సభలకు జనం రాకపోయినా లోకేష్ సీఎం జగన్ మీద అసత్య ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏదోరకంగా అభాసుపాలు చేసి దొడ్డిదారిన అధికారంలోకి రావాలని చంద్రబాబు, లోకేష్‌లు ఎల్లో మీడియాలో అసత్య ప్రచారం చేయిస్తున్నారని తెలిపారు. ప్రజలు వీరి మాటలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాలమహానాడు రాష్ట్ర నాయకులు పి.బాలకృష్ణ, సీహెచ్ భరత్, బి.సునీల్ బాబు, బి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హార్టీకల్చర్‌తో ఆహార భద్రత



జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవంలో మాట్లాడుతున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: ఈ భూమిపై గౌరవించదగిన వృత్తి వ్యవసాయమే అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో సోమవారం జరిగిన జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని జాతీయస్థాయిలో వ్యవసాయ విద్యాదినోత్సవంగా ప్రకటించిన నేపథ్యాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. వ్యవసాయ విద్యను యువత ఎంపిక చేసుకోవాలనే మంచి ఉద్దేశ్యంతో ఐసీఏఆర్ ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. హార్టీకల్చర్ ద్వారా పౌష్టికాహార భద్రత ఏర్పడుతుందన్నారు. దేశ జీడీపీలో 20 శాతానికి పైగా హార్టీకల్చర్ ద్వారా సమకూరుతుందన్నారు. వ్యవసాయంలో ఉద్యాన పంటలు రైతులకు మంచి ఆదాయాన్ని ఇస్తున్నాయన్నారు. వ్యవసాయ విద్యా దినోత్సవం ప్రాముఖ్యత గురించి విద్యార్థులు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు వీసీ ప్రశంసాపత్రాలు అందచేశారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి



స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం –స్పందన కార్యక్రమంలో డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ కె.ఎస్.ఎస్.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్డీఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో 156 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్జీలను నిర్దీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కార తీరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



సూర్యనారాయణ

మొగల్తూరు: విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మొగల్తూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరుకు చెందిన కుమారీ సూర్యనారాయణ(40) తన ఇంటి నిర్మాణ పనులు పరిశీలించేందుకు వెళ్లి దురదృష్టవశాత్తు విద్యుత్ వైర్లను తాకడంతో షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూర్యనారాయణ మృతి చెందడంతో పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సూర్యనారాయణకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తండ్రి నాంచారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎం.వీరబాబు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నూజివీడు: గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పొట్లూరి రాధికారాణి సోమవారం తెలిపారు. గన్నవరంలో ఇటీవల నిర్వహించిన సెలక్షన్స్‌లో ప్రతిభ చూపడంతో పాఠశాలకు చెందిన శషీద్, మణికంఠ, గాల్షీద్, అనూష, లక్ష్మీ ప్రసన్నలు బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పాలేశ్వరస్వామి ఆలయంలో మంత్రి పూజలు



మంత్రి కారుమూరిని సన్మానిస్తున్న పండితులు

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామంలో పాలేశ్వరస్వామిని సోమ వారం రాష్ట్ర పౌర సర ఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో, వేదా మంత్రోచ్చరణ మధ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని దేవుని ప్రార్థించామన్నారు. అనంతరం ఆలయ అర్చకులు శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచముఖి హనుమాద్ పీఠం అధిపతి తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, వేదా పండితులు తదితరులు పాల్గొన్నారు.

ఉమాసిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అత్తిలి ఉమాసిద్ధేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. వేకువజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని అభిషేక పూజలు జరిపారు. అత్తిలిలో గల ఉమాసిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రధాని మన్ కీ బాత్‌ను ప్రతి ఒక్కరూ వీక్షించాలి



కేంద్ర ప్రభుత్వ పథకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి నెలా జరిగే ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని మోదుగ గుంట గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రజలందరి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం, ఉపాధి హామీ పథకం, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సర్పంచ్ కట్టా సత్యవతి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి నగేష్, బండి శ్రీనివాస్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

తరుముకొస్తున్న మిచాంగ్ తుపాను

- తణుకులో ఎడతెరిపిలేని భారీ వర్షం
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు
- నేడు విద్యాసంస్థలకు సెలవు

తణుకు: మిచాంగ్ తుపాను ముంచుకొస్తోంది... దీంతో కుండపోత వర్షం ముంచెత్తుతోంది... బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం తణుకు నియోజకవర్గంలో కుండపోతగా వర్షం కురిసింది. సముద్ర తీరం నుంచి ఈదురుగాలులతో కూడిన ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. వర్షం, గాలుల దాటికి కొన్నిచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం తణుకు పట్టణంతో పాటు నియోజకవర్గంలో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చలిగాలులతో పాటు గాలి, వాన తోడవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఆదివారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది.

రైతుల్లో ఆందోళన...

మిచాంగ్ తుపాను రైతులను కలవర పెడుతోంది.



తణుకు నియోజకవర్గంలో నేలవాలిన వరి చేలు

కోతలు కోసి పంట నూర్పిళ్ల దశలో ఉండటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కంగారు పడుతున్నారు. వర్షాలు అధికంగా కురిస్తే తిండి గింజలు కూడా దక్కవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో సుమారు 45 వేల ఎకరల్లో వరి సాగు చేశారు. అయితే ఇప్పటి వరకు దాదాపు యాభైశాతం మేర మాత్రమే కోతలు పూర్తికాగా మరో వారం రోజుల్లో మాసూళ్లు పూర్తి చేసే వాళ్లమని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో తుపాను ముంచుకు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల్లో రైతులను అప్రమత్తం చేస్తున్నారు. మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు ఈదురు గాలులతో కొన్ని చోట్ల వరి పంట నేలకొరిగింది.

యంత్రాంగం అప్రమత్తం..

భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల ప్రజలు అప్రమత్తంగా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు అయినా అధికారులు సిద్ధంగా ఉన్నారు. అత్యవసరమైతే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మంగళవారం కూడా విద్యాసంస్థలకు సెలవు పొడిగించినట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని అధికారులు సూచిస్తున్నారు.

పంట నష్టం జరగకుండా చర్యలు



దువ్వలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

తణుకు టౌన్: తుపాను కారణంగా మండలంలో పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాధికారి సీహెచ్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలను వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలో రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామన్నారు. మండలంలోని 80శాతం వరికోతలు పూర్తి అయినట్లు తెలిపారు. మండలంలోని దువ్వ, తేతలి గ్రామాల్లోని వరి ధాన్యం రాసులను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పట్టుబడి జరిగిన ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. రైతులు ప్రస్తుతం పరిస్థితుల్లో వరిచేలను కోత కోసేందుకు ప్రయత్నించవద్దన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



తణుకు టౌన్: ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గానసభ సభ్యులు

తణుకు టౌన్: తెలుగు ప్రజలతోపాటు ప్రపంచంలోని సంగీత కళాకారులకు, గాయనీ గాయకులకు ఘంటసాల స్ఫూర్తిగా నిలిచారని తణుకు సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. సోమవారం మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101 జయంతి సందర్భంగా తణుకు మహిళా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెంటపాటి వెంకటేశ్వరరావు, పీ బ్రహ్మానందరావు, ఎస్ లక్ష్మణరావు, ఎస్ఆర్‌కే రాజు, పీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు...

సుమధుర తెలుగు సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వజయంతి సందర్భంగా తణుకు ఎన్టీయార్ పార్కు వద్ద గల ఘంటసాల విగ్రహానికి ప్రముఖ గాయకులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం తణుకు ఎన్టీయార్ పార్కు వద్ద గల ఘంటసాల విగ్రహానికి విగ్రహ వ్యవస్థాపకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వావిలాల సరళాదేవి, గాయకులు చిప్పాడ నాగేశ్వరరావు, ఆకుమర్తి రాజు, ఎం నాగమణి, బీ వాణీ, కె గంగా, వి మణిమాల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పద్మశ్రీ ఘంటసాల జయంతిని పట్టణంలోని వీకర్స్ కాలనీ ఘంటసాల విగ్రహం వద్ద గానసభ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు కాసిం మాట్లాడుతూ తెలుగు పాటకు వెలుగు ప్రసరింప చేయడంతో పాటు భగవద్గీతను పాడి తెలుగు జాతికి అందిన మధుర గాయకుడు ఘంటసాల అన్నారు. గానసభ కార్యదర్శి జేకే కృష్ణ మాట్లాడుతూ అపూరూప చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన గంధర్వ గాయకుడు ఘంటసాల అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లం శంకరావు, లక్ష్మణరావు, గాన సభ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో నారుమడి

తాడేపల్లిగూడెం రూరల్: తుపాను ప్రభావంతో సోమవారం కురిసిన వర్షానికి తాడేపల్లిగూడెం మండలంలోని దాళ్వా వరి నారుమడిలోకి నీరు చేరింది. నేడో... రేపో నాట్లు వేద్దామని ఆశించిన రైతులకు మిచౌంగ్ తుపాను నీరు చల్లింది. దీంతో నాట్లు వేసే ప్రక్రియకు బ్రేక్ పడింది. మరో 24 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో నారుమడిలో నీరు నిల్వ లేకుండా గాడుల ద్వారా నీటిని బయటకు పంపించాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. ఆరుగొలను, కొత్తూరు గ్రామాల్లో రమారమీ 197 ఎకరాల్లో కోతలు కోయవలసి ఉందని తెలుస్తోంది. ఈ వర్షాలు కారణంగా కోతలు కోయవద్దని అధికారులు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టి, వాతావరణం అనుకూలించిన తర్వాత కోయాలని రైతులకు ఏవో ప్రసాద్ హితవు పలికారు.



తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట గ్రామంలో వర్షపు నీటిలో వరి నారుమడి

9న దేవుని రాజ్య సువార్త సభ

పెంటపాడు: దేవుని రాజ్యసువార్త సభ ఈనెల 9న ఉదయం గూడెం 21వ వార్డు క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు గూడెం క్రీస్తు సంఘ సువార్తికులు, బైబిలు కళాశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రొక్కాల నాగబుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. బిక్కవోలుకు చెందిన సువార్తికులు బ్రదర్ ఎం. జాన్‌డీన్ ముఖ్యఅతిధిగా పాల్గొనే ఈ సభలో క్రీస్తుసంఘ సభ్యులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత

తాడేపల్లిగూడెం రూరల్: సంక్షేమ పథకాల అమలులో మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం సచివాలయం-2 పరిధిలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలన్నీ మహిళల పేరునే అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి మారాలంటే మహిళలతోనే సాధ్యమన్నారు. ఈ క్రమంలోనే ప్రతి పథకాన్ని మహిళల పేరునే అందిస్తున్నారన్నారు. మహిళలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చిన సీఎం జగన్‌ను 2024 ఎన్నికల్లో తిరిగి ఎన్నుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొలుత వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి చేకూరిన రూ.29కోట్ల లబ్ధి వివరాలతో కూడిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, అడ్డాల గోపీకృష్ణ, ముప్పిడి లక్ష్మణరావు, ఉండ్రాజవరపు రాజు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరెడ్డి, సచివాలయ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం సచివాలయం-2 వద్ద సంక్షేమ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రుద్రేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు



వేల్పూరులో రుద్రేశ్వర ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

తణుకు టౌన్: కార్తీకమాసం మూడవ సోమ వారం సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రుద్రేశ్వరస్వామికి సోమవారం లక్షపత్రి పూజ, లక్ష కుంకుమ పూజ, శాంతి కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు మణికంఠ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

8న వాహనాలకు వేలం

తణుకు: మండలంలోని తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో సీజ్ చేసిన మోటారుసైకిళ్లకు ఈనెల 8న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 8న ఉదయం 10 గంటలకు పోలీసు స్టేషన్ ఆవరణలో జరిగే వేలం ప్రక్రియలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

11న రాచర్లలో ఐక్య క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: ఈనెల 11న రాచర్ల హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఐక్యక్రిస్మస్ సెలబ్రేషన్స్ సాయంత్రం 5 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు యూత్ సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ వార్షిక కార్యక్రమంలో భాగంగా వేట్లపాలెంకు చెందిన పాస్టర్ జేమ్స్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ సందేశం అందిస్తారన్నారు. కేక్ కటింగ్‌తో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఈ సందర్భంగా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిసర గ్రామ క్రైస్తవ సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

అఖండ అన్నసమారాధన

అత్తిలి: మండలంలోని స్థానిక సంతమార్కెట్ సెంటర్‌లో నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షిర్డీసాయిబాబా మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువజన కమిటి, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆధ్యాత్మిక పుస్తకాల అందజేత

భీమవరం: చిన అమిరంలోని శ్రీ స్వామి యోగేశ్వర నందగిరి విశ్వశాంతి వృద్ధాశ్రమానికి భీమవరం రోటరీ క్లబ్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌వీఆర్‌సీ జయవర్మ ఆర్థిక సహకారంతో సోమవారం డైపర్లు, ఆక్సీమీటర్లు, బిస్కెట్లు, ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేశారు. క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ డా.సాయి దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్‌లో సోమవారం ఆశా డే నిర్వహించారు. బేబి సెంటర్ సిబ్బందితో పాటు వీకర్స్‌కాలనీ, యాగర్లపల్లి, కడకట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది హాజరైయారు. వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ కీటకజనిత నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గృహ సందర్శనాలు చేయాలని, గృహాల సముదాయాలు పరిశుభ్రంగా ఉంచుకొనట, వారానికి ఒకసారి డ్రై డే పాటించే విధంగా చూడాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్లు ఆశాలత, అమృత, శ్రావ్యలు, ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయారు, పద్మజ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రామకృష్ణ, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పరిధిలో ఈ నెల 9వ తేదీ శనివారం నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు వెల్లడించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ప్రకాష్‌బాబు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొవ్వూరి అప్పిరెడ్డిలు మాట్లాడుతూ రాజీ పడదగిన కోర్టు కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవాలని, సివిల్, క్రిమినల్, బ్యాంక్ తదితర ఇతర కేసులు రాజీపడవచ్చునని, న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజీ జరిగిన వెంటనే అవార్డులతో పాటు సర్టిఫికెట్స్ కూడా కక్షిదారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్ శ్రీ, అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అరుంధతి, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఏకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న కె.ప్రకాష్‌బాబు

రజక వృత్తిదారులు ఐక్యంగా ఉద్యమించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రజక వృత్తిదారులు దీర్ఘకాల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, నాయకులు చింతకాయల బాబూరావులు అన్నారు. పట్టణ అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ భవనంలో సోమవారం గురుశేఖర్ ప్రిన్సిపల్‌గా రజకుల అవగాహన చైతన్య తరగతులు నిర్వహించారు. భాస్కరయ్య మాట్లాడుతూ తరగతుల్లో నేటి హిందుత్వ, మతోన్మాద పరిస్థితులు, వృత్తిదారులపై ప్రభావం, ప్రభుత్వ వైఖరి, ప్రపంచీకరణ నూతన ఆర్థిక విధానాలు, వృత్తులపై ప్రభావం, పరిష్కార మార్గాలు, భవిష్యత్తు కర్తవ్యాలు తదితర అంశాలపై చర్చలు జరిగినట్లు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి, పట్టణాల నుంచి మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడకరాజు, వల్లభాపురం, వెంకటేశ్వరరావు, అంకయ్య, ఈశ్వరరావు, రాజు, సుబ్బారావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నేరెళ్ళ శ్రీనివాస్, మాలకొండయ్య జిల్లా నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

కోటి దీపోత్సవం..కనుల పండువగా

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం సందర్భంగా సోమవారం రాత్రి పట్టణ బలుసులమ్మ ఆలయం వద్ద కోటి దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంవద్ద యువ నాయకుడు కొట్టువిశాల్, కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కొట్టు విశాల్



కోటి దిపోత్సవంలో పాల్గొన్న మహిళలు

విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించండి

పెంటపాడు: తుపాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాలో సమస్యల్ని తక్షణం పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ ఏఈ పెద్దిరాజు తెలిపారు. తుపాను ప్రభావం వల్ల విద్యుత్ తీగలు పడిపోయినా, స్తంభాలు వాలిపోయినా, వైర్లపై చెట్లు కూలినా, విద్యుత్ తీగలు తెగిపడినా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లల్లో స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచుకోవాలన్నారు. తడిచేతులతో కరెంట్ స్తంభాలు, మోటర్లను తడి చేతులతో ముట్టుకోవద్దని హెచ్చరించారు. ఇళ్ల సర్వీసు వైర్లు తెగినా, జాయింట్లు కట్ అయినా సమాచారం తెలియజేయాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్ల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

'గూడెం'లో 36.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో తుపాను ప్రభావంతో 36.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.శివశంకర్ సోమవారం తెలిపారు. ఉదయం 8.30 గంటల ముందు వరకు 8.0 మిల్లీ మీటర్లు, ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 28.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు. రానున్న 24 గంటల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.